
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం
23 అక్టోబర్ 2025 పేజీలు : 08


భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు

## అప్రమత్తంగా ఉండాలి

**ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి**



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

అల్పపీడన ప్రభావంతో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. వర్షాల కారణంగా ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అనుకోని అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ముందు జాగ్రత్తగా అనువైన ఆశ్రయ కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రజలు జిల్లా కలెక్టరేట్‌లో అధికారులు 0861 2331261, 7995576699 నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారని, ప్రజలకు అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ప్రజల భద్రతకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని వెల్లడించా రు. అన్ని శాఖల అధికారులు ప్రధానంగా మున్సి పల్, వైద్య, ఆరోగ్యం, విద్యుత్, ఇరిగేషన్, పంచా యతీ రాజ్, విపత్తు నిర్వహణ తదితర శాఖల అధికారులు ప్రజలు అందుబాటులో ఉంటారన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రదేశాలకు

-మిగతా 2లో



ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు

## అధికార యంత్రాంగం సిద్ధం

నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :

ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో అధికారులు ఎలాంటి వాతావరణ పరిస్థితులునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. బుధవారం నెల్లూరు గోమతినగర్ మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాలు విపరీతంగా కురుస్తున్న కారణంగా చేపట్టాల్సిన చర్యల గురించి దిశ నిర్దేశం చేశారు. వర్షపు నీరు సులువుగా ప్రవహించేలా తగిన ఏర్పాట్లు చేపట్టాలని, ఈ క్రమంలో కాలువలపై ఆక్రమణలు ఏమన్నా ఉంటే వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. పలు అంశాలపై మంత్రికి అధికారులు విన్నవించారు. చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

-మిగతా 2లో

- ప్రస్తుత వర్షాలు నేపథ్యంలో చేపడుతున్న చర్యలపై మంత్రి ఆరా
- వర్ష ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన
- నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.165 కోట్లు విడుదలైనట్లు తెలిపిన మంత్రి పొంగూరు నారాయణ
- నెల్లూరులో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

నేడు పాఠశాలలకు,

## జూనియర్ కళాశాలకు సెలవు

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

తుఫాను కారణంగా జిల్లాలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈనెల 23వ తేదీ గురువారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్వాడీ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఉత్తర్వులను అన్ని రకాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విధిగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

వక్ఫ్‌బోర్డు ఆదాయాన్ని

## రెండింతలు పెంచాం



- రాష్ట్రవ్యాప్తంగా ఆక్రమణకు గురైన 700 ఎకరాల వక్ఫ్ భూమిని స్వాధీనం చేసుకున్నాం
- వైజాగ్ ఎన్‌టీపీసీలో 319 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించాం
- కర్నూలులో వక్ఫ్ భూమికి చేసిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశాం
- వక్ఫ్ ఆస్తులు దేవుడి ఆస్తులు.. ముతవల్లీల ఆస్తులు కాదు, మీరు మేనేజర్లు మాత్రమే..
- కబ్జాదారుల కబంధహస్తాల్లో ఉండి ఎన్నో ఏళ్ల నుంచి లీజుకు ఇవ్వని భూములను లీజుకు ఇచ్చాం

**ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు షేక్. అబ్దుల్ అజీజ్**



మీడియాతో మాట్లాడుతున్న షేక్. అబ్దుల్ అజీజ్

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్.. రాష్ట్రంలోని 32 వక్ఫ్ సంస్థల నూతన మేనేజింగ్ కమిటీలు, ముతవల్లిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వక్ఫ్ భూములు దేవుడి భూములని, ముతవల్లీల భూములు కాదని, ముతవల్లీలు కేవలం మేనేజర్లు మాత్రమే అన్నారు. వక్ఫ్ సంస్థలను రక్షించి, అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. వక్ఫ్ ఆస్తులను తక్కువ అద్దెలకి ఇచ్చి సమాజ సేవ చేస్తున్నామని అనుకోవద్దని, ఆదాయాన్ని పెంచి.. దానిని పేద ప్రజల సంక్షేమానికి వినియోగించాలన్నారు. మార్కెట్ విలువ పది వేలు ఉంటే వక్ఫ్ ఆస్తులను వెయ్యి, రెండు వేలకు అద్దెలకు ఇచ్చి ఉన్నారని, ఇది ముస్లిం సమాజానికి ద్రోహం చేయడమేనన్నారు. ఈ ఏడాది కాలంలో ఆక్రమణలకు గురైన 700 ఎకరాల వక్ఫ్ భూమిని స్వాధీనం చేసుకున్నామని, వైజాగ్‌లో 319 ఎకరాలు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించామని

-మిగతా 2లో

సీతారామాంజనేయ స్వామి ఆలయానికి

## భూమిపూజ

- విశిష్ట అతిథులుగా హాజరైన దేవాదాయ శాఖ మంత్రి ఆనం, ఎమ్మెల్యే కాకర్ల సురేష్



వింజమూరు మండలం గుండెమడకల గ్రామంలో శ్రీవాణి ట్రస్ట్ అందజేసిన రూ.కోటి నిధులతో శ్రీ సీతా రామాంజనేయ ఆలయానికి భూమిపూజ చేశారు.

వివరాలు 2లో

# సీతారామాంజనేయ స్వామి ఆలయానికి భూమిపూజ

## విశిష్ట అతిథులుగా హాజరైన దేవాదాయ శాఖ మంత్రి ఆనం, ఎమ్మెల్యే కాకర్ల సురేష్





**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం గుండెమడకల గ్రామంలో శ్రీవాణి ట్రస్ట్ అందజేసిన కోటి రూపాయల నిధులతో శ్రీ సీతా రామాంజనేయ ఆలయానికి భక్తుల జయజయ ధ్వానాలు మధ్య వేదపండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. విశిష్ట అతిథులు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని, పూజించిన ఇటుకలను అందజేశారు. వేద పండితుల వద్ద ఆశీర్వాదాలు అందుకున్నారు. అనంతరం శ్రీ సీతారామాంజనేయ స్వామి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు ఆలయ భూమిపూజ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి గుండెమడగల గ్రామస్తులు, స్థానిక ప్రజా ప్రతినిధులు అపూర్వ స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున బాణాసంచాలు కాల్చుతూ పూలను వెదజల్లారు. అనంతరం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. తిరుమల తిరుపతి దేవస్థానం నుండి కోటి రూపాయలు నిధులను మా నియోజకవర్గంలోని గుండెమడుగల గ్రామానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అందించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీ సీతారామస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులంతా కలిసికట్టుగా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి, అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. నా వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. కోటి రూపాయల టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో గుండెమడకల గ్రామంలో శ్రీ సీతారామాంజనేయస్వామి వారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. గుండెమడకల గ్రామంతో తమ కుటుంబానికి మంచి అనుబంధం ఉందని, ఈ గ్రామ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని తెలిపారు. ఈ ఆలయ నిర్మాణం కోసం స్థానిక నాయకులు, మాజీ ఎఫ్సీఐ డైరెక్టర్ అంకినపల్లి ఓబుల్ రెడ్డి గ్రామస్తులు పలుసార్లు విజ్ఞప్తి చేశారని తెలిపారు. నేడు ఈ మహత్కార్యానికి శ్రీకారం చుట్టడం చాలా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించేందుకు అన్ని విధాలా కృషి చేస్తానని, ఆలయ నిర్మాణం తర్వాత కూడా ధూప దీప నైవేద్యానికి, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులు సమకూరుస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5600 ఆలయాలకు ధూప దీప నైవేద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను ఖర్చు చేస్తున్నామన్నారు. మా నియోజకవర్గంలోని మర్రిపాడు మండలంలో సోమశిల హై లెవెల్ పేస్ టు ద్వారా నేను ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఐదు రిజర్వాయర్లను మంజూరు చేశామని, అంకినపల్లి ఓబుల్‌రెడ్డి కృషితో వింజమూరు మండలం గుండేమడగల గ్రామం చెరువును ఆరో రిజర్వాయర్‌గా పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వాలు మారినందున కొంత ఆలస్యం జరిగిందని, రైతులకు ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు వెళ్లి నిధులను తీసుకువచ్చి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, గుండేమడగల రిజర్వాయర్‌కి ఏ పేరు పెట్టమంటే ఆ పేరు పెట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో ఉదయగిరి నియోజకవర్గంలో అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అతిథులను గజమాలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవులు నాయుడు, రీజనల్ జాయింట్ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ ఆజాద్, అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, డిఈసిహెచ్ శ్రీనివాసులు, ఆలయ ధర్మకర్త చీమల వెంకటరత్నారెడ్డి, చీమల శ్రీనివాసులు రెడ్డి, చీమల విజయభాస్కర్, చీమల వెంకటేశ్వర రెడ్డి, చీమల రాజశేఖర్ రెడ్డి, అంకినపల్లి పుల్లారెడ్డి, చీమల రామురెడ్డి, చీమల భాను ప్రతాపరెడ్డి, బిజెపి అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయులు, మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్ల యాదవ్, మాజీ ఎఫ్సీఐ డైరెక్టర్ అంకినపల్లి ఓబుల్ రెడ్డి, అంకినపల్లి శివశంకర్ రెడ్డి, కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు గణపం సుదర్శన్‌రెడ్డి, ఉండేలా గురవారెడ్డి, గాలి రామ్మోహన్ నాయుడు, గాలి నరసప నాయుడు, బుర్రాల శ్రీనివాసుల యాదవ్, కే.శ్రీనివాసులు నాయుడు, రైతు అధ్యక్షులు బొల్లినేని వెంకట రామారావు, మాజీ జడ్పీటిసి సభ్యులు దామా మహేష్, దుత్తలూరు మాజీ ఎంపీపీ చీకుర్తి రవీంద్రబాబు, మాజీ జడ్పీటిసి పాముల సుబ్బరాయుడు, మల్లంపాటి గురవయ్య నాయుడు, కూనల వెంకటేశ్వర్లు నాయుడు, అన్నపురెడ్డి వెంగళరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు దిండు మహేష్, విశ్రాంత డిఎం అండ్ హెచ్ఓకేమా శిలామణి, వంశీ నాదెళ్ల, ఇతర నాయకులు భక్తులు అధికారులు తదితరులు ఉన్నారు.

### ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు

# అధికార యంత్రాంగం సిద్ధం



*(మొదటి పేజీ తరువాయి)*

కురుస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరులో అత్యధికంగా 146.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. వర్షాల క్రమంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలియజేశారు. అయితే కాలువల్లో పూడికతీత పనులు చేయడం వల్ల నెల్లూరు కార్పొరేషన్‌లో ఎక్కడా నీరు నిలవడం లేదన్నారు. అదేవిధంగా 123 మున్సిపాలిటీల్లో రూ.50 కోట్లతో పూడిక తీత పనులు చేపట్టామని తెలిపారు. నెల్లూరు సిటీలో 47 పార్కులను అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.165 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని స్పష్టం చేశారు. దగదర్తిలో ఎయిర్పోర్టుకు త్వరలో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేస్తారన్నారు. అలాగే కోవూరు షుగర్ ఫ్యాక్టరీ దగ్గర పరిశ్రమ ఏర్పాటు చేసి వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. నెల్లూరును మంచి మోడల్ సిటీగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. కొద్ది రోజులు ఓపిక పడితే ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసాన్ని సరి చేస్తున్నామని, గత ప్రభుత్వం ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ తీసుకొచ్చామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కావలికి టౌన్ ప్లానింగ్ వాళ్ళు వెళ్ళి పరిశీలిస్తే రాజకీయ రంగు పులుముతున్నారని తెలిపారు. నెల్లూరులో 3 అంతస్తులకు అనుమతులు తీసుకుని 7 అంతస్తులు కడితే వాటిని కూల్చేశామని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కడితే కూల్చడం ఖాయమన్నారు. పంట కాలువలను చాలా మంది ఆక్రమించారని, అలాంటి ఆక్రమాలలో వెంటనే తొలగించాలంటూ అధికారులను ఆదేశించినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, పాల్గొన్నారు.

## వక్ఫ్‌బోర్డు ఆదాయాన్ని రెండింతలు పెంచాం

*(మొదటి పేజీ తరువాయి)*




తెలిపారు. కర్నూల్‌లో వక్ఫ్ ఆస్తి అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేశామని తెలిపారు. కబ్జాదారుల కబంధహస్తాల్లో ఉండి ఎన్నో ఏళ్లుగా లీజుకు ఇవ్వని భూములను లీజుకు ఇచ్చామని, వక్ఫ్ బోర్డ్ ఆదాయాన్ని రెండింతలు పెంచామని తెలిపారు. ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగిస్తే ఏ చట్టమైతే అమలవుతుందో, ముతవల్లీలకు ఆటంకం కలిగించినా.. అదే చట్టం అమలవుతుందన్నారు ధైర్యంగా పని చేయాలన్నారు. తాలిం ఏ హునర్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 28 స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, కేవలం టైలరింగ్‌తో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఆగవని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మేమున్నా.. లేకున్నా.. ఈ కార్యక్రమం ఆగకుండా వ్యూహం రచిస్తున్నామని తెలిపారు. ప్రతి మేనేజింగ్ కమిటీ, ప్రతి ముతవల్లి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో 500 మంది ప్రతిభావంతులైన ముస్లిం విద్యార్థులను టాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపిక చేసి ఉచిత ఇంటర్మీడియట్ విద్య అందించబోతున్నామని తెలిపారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యులు బెపారి జాకీర్ అహ్మద్, సీఈవో మొహమ్మద్ అలీ పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

*(మొదటి పేజీ తరువాయి)*

తరలి వెళ్లాలని, వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహించేటప్పుడు వాటి సమీపంలో ఉండొద్దని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, గోడలకు దూరంగా ఉంటూ ప్రజలు సురక్షిత ప్రాంతంలో ఉండాలని, ప్రజల భద్రతకు ప్రభుత్వ అధికారులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. తడిచిన విద్యుత్ స్తంభాలు, ఇనుప స్తంభాలు, గోడలను ముట్టుకోవద్దని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిత్యం అందుబాటులో ఉంటారని, ఎలాంటి సమస్య ఉన్నా వారిని సంప్రదించాలని పేర్కొన్నారు. తీరప్రాంత మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్ళొద్దని, వర్షాలు తగ్గేంత వరకు సురక్షితంగా ఉండాలని సూచించారు.

## మాగుంట లేఔట్ అండర్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మాగుంట లేఔట్ అండర్ బ్రిడ్జ్ వద్ద 13.50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఫుట్ పాత్ నిర్మాణ పనులకు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ తదితరులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ నెలరోజుల్లో ఈ పనులు పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రామలింగాపురం అండర్ బ్రిడ్జిలో భారీ వర్షాలు పడినా చుక్కనీరు నిలవకుండా ఉండటం చూస్తున్నామన్నారు. నెల్లూరు రూరల్ ప్రజలకు భారీ వర్షాలతో ఏ ఇబ్బంది వచ్చిన ఒక ఫోన్ చేయాలని కోరారు. అభివృద్ధిలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో నూకరాజు మదన్ కుమార్ రెడ్డి, టిడిపి డివిజన్ అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

# ఆత్మకూరులో కొనసాగుతున్న వర్షం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో, మండలంలో, డివిజన్‌లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షం బుధవారం కూడా కొనసాగుతోంది. మరో నాలుగు రోజులు కూడా అతిభారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణకేంద్ర హెచ్చరికలతో జనాలు ఆందోళనకు గురవుతున్నారు. అల్పపీడన ప్రభావంతో సోమవారం తెల్లవారుఝామునుండి వర్షాలు కురుస్తుండగా మంగళవారం కూడా ఏమాత్రం ఎడతెరిపి లేకుండా కుండపోతవర్షం కురవగా బుధవారం కూడా అదేమాదిరిగా ఎడతెరిపిలేకుండా వర్షం కురవసాగింది. ఆత్మకూరు,అనంతసాగరం మండలాల్లో ఖరీఫ్‌లో సాగుచేసిన వరిపైరు పంటదశలో ఉన్నందున తీవ్రనష్టం కలుగనుందని రైతులు వాపోతున్నారు. ఈవర్షం రబీసీజన్‌కు మేలుజరుగుతుందని పలువురు



## అప్రమత్తంగా ఉన్న అధికారయంత్రాంగం

భావిస్తున్నారు. ఈభారీ వర్షాలు, వరదలనేపద్యంలో స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావని డివిజన్‌లోని అందరు అధికారులను అప్రమత్తంచేసి కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. తీరప్రాంతాలను, పొంగిప్రవహిస్తున్న వాగులను ఆమె పరిశీలించారు. రోడ్లపై నీరుపొంగిప్రవహిస్తున్న ప్రాంతాల్లో రాకపోకలు లులేకుండా చర్యలు తీసుకున్నారు. లోతట్టుప్రాంతాలుగా జలమయమైన కాలనీలను, గ్రామాలను ఆమె పరిశీలించారు. అవసరమైన వారిని సురక్షితప్రాంతాలకు తరలించేందుకు కూడా అన్నీ సిద్ధం చేశారు. మంగళవారం డివిజన్‌లోని ఆత్మకూరు మండలంలో 94.6మీ.మీలు, సంగం మండలంలో 51.2, అనంతసాగరం మండలంలో 30.8, చేజర్ల మండలంలో 50.2, కలువాయి మండలంలో 30.6, ఏఎస్‌పేట మండలంలో 48.4మి.మీ, మర్రిపాడు మండలంలో 46.0, ఉదయగిరి మండలంలో 14.6, సీతారామపురం మండలంలో 18.2మీ.మీల వర్షపాతం నమోదైంది. బుధవారం డివిజన్‌లోని సీతారామపురం మండలంలో 20.2మి.మీ, ఉదయగిరి మండలంలో 47.2మి.మీ, మర్రిపాడు మండలంలో 53.4మి.మీ, ఆత్మకూరు మండలంలో 24.2మి.మీ, ఏఎస్‌పేట మండలంలో 27.6మి.మీ, సంగం మండలంలో 16.2మి.మీ, చేజర్ల మండలంలో 22.6మి.మీ, అనంతసాగరం మండలంలో 50.4మి.మీల వర్షపాతం నమోదైంది. సోమశిల జలాశయంలో 69.80టిఎంసిల నీరు నిల్వ ఉండగా పైతట్టుప్రాంతాలనుండి 19670 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. దాంతో 32650 క్యూసెక్కుల వంతున నీటిని విడుదలచేస్తున్నారు. దాంతో తీరప్రాంతగ్రామాలకు ఎలాంటి ఇబ్బందిలేకుండేలా అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఎడతెరిపిలేకుండా కుండపోత వర్షం కురవగా మరో నాలుగు రోజుల్లో అతిభారీ వర్షాలు కురవనున్నాయన్న హెచ్చరికల నేపద్యంలో మరెంతగా వర్షపాతం నమోదుకానుందో చూడాల్సి ఉంది. సోమశిల జలాశయంనుండి అధికంగా నీటివిడుదల, బంగాళాఖాతంలో



అల్పపీడనం, భారీవర్షాల హెచ్చరికలతో స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావని ముందుగానే స్పందించి అన్నిమండలాల్లో, ఆత్మకూరు పట్టణంలో అధికారులనందరినీ అప్రమత్తం చేశారు. ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయయ్యాయి. అధికారులు లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. పెన్నాపరీవాహక గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. అధికారులకు అన్నీ ముందస్తు జాగ్రత్తల సూచనలు చేశారు. అధికారులందరూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. భారీవర్షాల నేపద్యంలో ఆర్డీవోతోపాటు అన్ని మండలాల తహశిల్దార్లు, స్థానిక డిఎస్‌పి వేణుగోపాల్, సిఐ గంగాధరం, అందరు ఎస్‌ఐలు, అందరు తహశిల్దార్లు లోతట్టు, తీరప్రాంత గ్రామాల్లో పర్యటిస్తున్నారు. అందరూ అప్రమత్తంగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.



# పదమూడేళ్ళయినా పూర్తికాని తహశిల్దారు కార్యాలయం








**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో అనేక భవనాలు నిర్మాణంలో అర్ధాంతరంగా నిలిచిపోవడం, వాటిని గురించి పట్టించుకొనకపోతుండడం పరిపాటిగా ఉండగా అత్యంత ప్రాధాన్యత కలిగిన మండల రెవిన్యూకార్యాలయ భవనం దశాబ్దం దాటినా నిర్మాణం పూర్తికాకుండా దర్శనమిస్తుండడం గమనార్హం. గత మూడురోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడం, మరో నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు వస్తుండడంతో సిబ్బందిలో ఆందోళన కన్పిస్తోంది. నూతన భవనాలు ఒకటికాదు, రెండు కాదు ఏకంగా 12సంవత్సరాల క్రితం శంఖుస్థాపన గావించబడి పనులు ప్రారంభమై శ్లాబ్‌లెవల్‌కు చేరగా ఈనాటికీ పూర్తికాకుండా అదేపరిస్థితి కొనసాగుతోంది. ప్రస్తుతం తహశిల్దారు కార్యాలయం కొనసాగుతున్న బ్రిటిష్‌కాలంనాటి భవనం శిధిలావస్థకు చేరుకోగా వర్షాలకు ఉరుస్తుండడంతో అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతుండడంతోపాటు రికార్డులు తడిచిపోతాయనే ఆందోళనతో కొనసాగుతున్నారు. భవన పైకప్పుకు తార్పాలిన్ పట్టలు కప్పుకొని కాలం వెళ్ళబుచ్చుతున్నారు. 2012లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖామాత్యులు ఆత్మకూరు ఎమ్మెల్యేగా ప్రాతినిద్యం వహిస్తూ దాదాపు 2500కోట్ల రూపాయల నిధులు సాధించి అనేక రోడ్లు, భవనాలు, సంస్థలు, వంతెనలు తదితరాలను సాధించారు. అందులోభాగంగా ఆత్మకూరు మండల రెవిన్యూకార్యాలయ ఆవరణలో తహశిల్దారు కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, సబ్‌ట్రెజరీ భవనాల నిర్మాణాలకు 3కోట్ల రూపాయలను ఆనం రామనారాయణరెడ్డి మంజూరు చేయించి అప్పటి రెవిన్యూమంత్రి ఎన్.రఘువీరారెడ్డిని రప్పించి శంఖుస్థాపనలు గావించారు. కాగా ట్రెజరీ కార్యాలయం తమ శాఖనిధులు సాధించుకొని భవనం నిర్మించుకొని శిధిలమైన భవనం నుండి నూతన భవనంలోకి మారారు. రెవిన్యూ డివిజన్ కార్యాలయ భవనం నిర్మాణం నిలిచిపోయి ఉండగా ఏడాదిన్నర క్రితం అప్పటి కలెక్టర్ చొరవతీసుకొని పనులు పూర్తిచేయించి ప్రారంభోత్సవం గావించి ఆర్డీవో కార్యాలయాన్ని నూతన భవనంలోకి తరలించారు. ఇక తహశిల్దారు కార్యాలయ భవనం మాత్రం అలాగే శ్లాబ్‌లెవల్‌లో దర్శనమిస్తోంది. అయితే ఈ ఈదపా మళ్ళీ ఆత్మకూరు శాసనసభ్యులుగా ఆనం రామనారాయణరెడ్డి విజయం సాధించడం, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రిగా కొనసాగుతుండడం జరగ్గా ఆయన ఈ భవనాన్ని పరిశీలించి తాను ఆనాడు మంజూరుచేయించి ఇంకా పూర్తికాకపోవడం బాధాకరమని పేర్కొంటూ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కానీ ఇంకా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కానరావడం లేదు. వర్షాకాలంలో అధికారులు, సిబ్బంది తీవ్రంగా ఇబ్బందిపడుతూ ఆందోళన చెందుతున్న పరిస్థితిని గమనించి ఇప్పటికైనా ఈ భవనం నిర్మాణం పూర్తిచేయాలని, రామనారాయణరెడ్డి ఎంతో శ్రద్ధతో నిధులు సాధించిన భవనాన్ని పూర్తిచేసి ఆయన సంకల్పానికి సార్ధకత చేకూర్చాలని సర్వత్రా కోరుతున్నారు.

## విద్యుత్‌సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారీ వర్షాలతో జనజీవనం అస్థవ్యస్థంగా మారిననేద్యంలో ఆత్మకూరు పట్టణంలో విద్యుత్‌సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, ప్రజారోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండాలని పలువురు కోరుతున్నారు. భారీ వర్షాలు, చలిగాలులుతో వైద్య, ఆరోగ్యశాఖ, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వర్షం ఆగినపుడు బ్లీచింగ్ చల్లేందుకు చర్యలు తీసుకోవాలని, దోమలు పెచ్చు పెరగకుండా చూడాలని, అసలే విపరీతంగా జ్వరాలు సోకిఉన్న తరుణంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులు మందులతో సిద్ధంగా అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. పట్టణంలో తరచూ విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, అసౌకర్యంగా ఉంటుందని, సంబంధిత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కూడా కోరుతున్నారు. వర్షం లేని సమయాల్లో అన్ని సరిచేసుకోవాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని కూడా పలువురు కోరుతున్నారు.

## కార్తీకమాసంలో శివక్షేత్రాల

# సందర్శనకు ప్రత్యేక బస్సులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కార్తీకమాసంలో శివక్షేత్రాలను భక్కులు సందర్శించుకునేందుకుగాను ఆత్మకూరు ఆర్టీసీ డిపోనుండి ప్రత్యేక యాత్రాబస్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు డిపో మేనేజర్ ఎం.శివకేష్‌యాదవ్ మాట్లాడుతూ.. కాణిపాకం, వేలూరు (గోల్డెన్ టెంపుల్), అరుణాచలం, కంచి, తిరుత్తణి,శ్రీకాళహస్తిలను సందర్శించుకునేలా ఆదివారం ప్రత్యేక బస్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం 9గంటలకు ఆత్మకూరులో ఈబస్సు బయలు దేరుతుందని, కాణిపాకం, వేలూరులను దర్శించుకొని అరుణాచలం చేరుతుందని, సోమవారం కంచి, తిరుత్తణి, శ్రీకాళహస్తిలను సందర్శిం చుకొని రాత్రి 10గంటలకు ఆత్మకూరుకు చేరుతుందన్నారు. ఒక్క ప్రయాణీకుడికి టిక్కెటుధర కేవలం 1800 రూపాయలు మాత్రమేనని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ఆత్మకూరు ప్రాంత ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 7382924753 నెంబరుతో సంప్రతించాలని శివకేష్‌యాదవ్, అసిస్టెంట్ మేనేజర్ రాస్‌కుమార్‌లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందని వారు పేర్కొన్నారు.

# ఏలాంటి అంతరాయం లేకుండా అన్ని చర్యలు : కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక ట్రంకు రోడ్డులోని లీలా మహల్, ఆచారి వీధి, డిఆర్ ఉత్తమ హెూటల్, తదితర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి అధికారులతో కలిసి పర్యటించారు. భారీ వర్షాలకు వరద నీరు రోడ్లపై చేరి వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారకుండా నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. అండర్ బ్రిడ్జిల ప్రాంతంలో చేరే వరద నీటిని తొలగించేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఏలాంటి అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నగరవ వ్యాప్తంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో అన్ని అండర్ బ్రిడ్జిల వద్ద ప్రత్యేక దృష్టి సారించి, వర్షపు నీరు చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా మోటర్ల సాయంతో ఎప్పటికప్పుడు నీటిని తొలగించి వేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా, సమీపంలోనే డ్రైను కాలువల ద్వారా వరద నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. బ్రెయిన్ కాలువల ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న మెట్లు, ర్యాంపులు తదితర నిర్మాణాలను తొలగించి, వరద నీరు సాఫీగా ప్రవహించే చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. భారీ వర్షాలకు సంబంధించి ఎలాంటి సహాయ కార్యక్రమాలు అవసరం ఉన్న నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఏర్పాటు చేసి ఉన్న సైక్లోన్ కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ 0861 2356777, 0861 2316777 నెంబర్లను సంప్రదించాలని కమిషనర్ సూచించారు.



# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాబోయే రెండు రోజులు నెల్లూరు జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వారి భద్రతకు ప్రభుత్వ అధికారులు అధిక ప్రాధాన్యత నిస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలని పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజల భద్రత కోసం ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజల కోసం తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, వారికి అవసరమైన సహాయాన్ని అందించి ఆదుకోవాలని కోరారు. ప్రజలు తప్పనిసరిగా కొన్ని అత్యవసర జాగ్రత్తలు పాటించాలని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా, వెంటనే సురక్షితమైన ఎత్తైన ప్రదేశాలకు తరలి వెళ్లాలని సూచించారు. వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహించేటప్పుడు వాటిని దాటే సాహసం అస్సలు చేయవద్దని చెప్పారు. పాత, శిథిలావస్థలో ఉన్న భవనాలు, గోడలకు దూరంగా ఉంటూ సురక్షిత ప్రాంతంలో ఉండాలన్నారు. ఎలక్ట్రిక్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలను తాకవద్దు. ఇంట్లోకి నీరు వస్తే వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయలన్నారు. తగినంత త్రాగునీరు, మందులు, టార్చ్ లైట్లు, కొవ్వొత్తులు, పొడి ఆహారం వంటి అత్యవసర వస్తువులను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. వర్షంలో లేదా వరద నీటి దగ్గర పిల్లలు ఆడకుండా చూసుకోవాలని చెప్పారు.

# ముత్తుకూరు వాగును పరిశీలించిన ఎంపీడీఓ, ఎస్ఐ

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మండలంలో ఐదు రోజులలో వర్షాలు కురవడంతో ముత్తుకూరు వాగు పొంగిపొర్లినది దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం అనంతసాగరం మండలం ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, అనంతసాగరం ఎస్ఐ సూర్యప్రకాశ్ రెడ్డి ముత్తుకూరు వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందిని అందుబాటులో ఉంచి ఎవరిని ప్రవాహంలో దిగకుండా జాగ్రత్తలు చేపట్టడం జరిగినది. రేవూరు ఎస్సీ కాలనీలో నిలిచిన నీటిని కొమ్మలేరు వాగుకు మళ్ళించారు. కాలవలను నిల్వ ఉన్న నీరును జేసీపీ సహాయంతో తొలగించారు. ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ.. ఈనెల 24వ తేదీ వరకు భారీ వర్షం సూచన ఉన్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించినట్లు అన్నారు. లోతట్టు ప్రాంతాలలో నివాసాలలో నీరు చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సహకారంతో అత్యవసర పరిస్థితిలో ప్రజలకు పునరావాసం ఏర్పాటు చేయాలని కోరారు. ఆరోగ్యం బాగా లేని వారికి మందులు పంపిణీ, కాచి చల్లార్చిన నీటిని తాగే విధంగా అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి ఆయన సూచించారు.



# మెట్టా ఆధ్వర్యంలో అయ్యప్పలకు బిక్ష ఏర్పాట్లు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** తాళ్లపూడి గ్రామం సాయిబాబా మందిరం నందు బుధవారం అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమాలు ప్రారంభం కావడం జరిగింది. కార్యక్రమం నిర్వాహకులు మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్తీక మాసం నందు దీక్ష చేస్తున్న అయ్యప్ప, శివయ్య, భవాని మాలాదరణ భక్తులకు నెల రోజులపాటు మెట్టాకుటుంబ సభ్యులు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమం మూడవ సంవత్సరానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సుందరేశ్వర స్వామి ఆకాశ దీపోత్సవం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం, దుర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు కార్తీక మాసం సందర్భంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు శ్రీ స్వామి వారి శిఖరం నందు ఆకాశ దీపంను, ఆలయ ప్రధాన అర్చకులు రఘురామ మూర్తి, ఉప ప్రధాన అర్చకులు, వేదపండితులు, అర్చకులు ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్తీక దీపంకు కట్టిన భక్తులు కుండలో దీపాలను వెలిగించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సుజితమ్మ, వారి వెంట చెక్కా అహోల్యా, ఆలయ సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వేదగిరిపై స్వాతి నక్షత్ర విశేష పూజలు



**నెల్లూరు రూరల్, మేజర్ న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వేంచేసియున్న వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవ స్థానం నందు బుధవారం స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా మూలవిరాట్‌కు స్నపన తిరు మంజనం, తిరుప్పావడ సేవ కార్యక్రమాలు వేద మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగాయి. ముందుగా మూలవిరాట్‌కు స్నపన తిరుమంజనం కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగగా ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి, నూనె మల్లికార్జున యాదవ్ తదితరులు పాల్గొనగా, అనంతరం తిరుప్పావడ సేవ ముఖ్య అర్చకులు మాధవగిరి భాస్కరా చార్యులు శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు. ఉభయ కర్తలుగా నెల్లూరు వాస్తవ్యులు ఫెడోరా సీ ఫుడ్స్ అధినేత కాకాణి నరహరి రెడ్డి విజయ గౌరి దంపతులు, వారి కుమారుడు భరత్ సింహారెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి, ప్రధాన అర్చకులు భాస్కరా చార్యులు, అర్చకులు కృష్ణమా చార్యులు, రాఘవా చార్యులు, భక్తులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ మల్లికార్జున స్వామి ఆకాశ దీపోత్సవం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆకాశ దీపోత్సవ కార్యక్రమం విశేషంగా జరిగింది. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, సహాయ కమిషనర్– కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, పాలక మండలి సభ్యులు ఆకాశ దీపోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీ స్వామి వారి ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక కంచు పాత్రలో దీపంను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆకాశ దీపోత్సవంను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ శ్రీ తిరుమూరు అశోక్ రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం




**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన కుంభవృష్టి వర్షం ఉండడంతో సైదాపురం మండల తహసిల్దార్ సుభద్ర తక్షణ భద్రతా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సైదాపురం మండలం తురుమెర్ల గ్రామంలోని పిన్నేరు వాగు బ్రిడ్జిపై భారీ వరద ప్రవాహం రావడంతో తక్షణమే స్పందించిన తహసిల్దార్ సుభద్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రవహిస్తున్న పిన్నేరు వాగు గూడూరు నుండి పొదలకూరు వెళ్లేటువంటి బస్సు మార్గాలను నిలిపివేసి వాహనదాల రాకపోకలను అడ్డుకొని సంఘటన స్థలంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రజలు ఎవరు కూడా బయటికి రాకూడదని వచ్చిన ఇలా ప్రవహించే కాలువల వైపు గానీ వాగులు వైపు కానీ పోరాదని తెలుపుతూ.. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన కారణంగా.. ఇది పశ్చిమ వాయవ్యంగా కదిలి 36 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని, ప్రజలందరూ కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని వర్షపు నీరే కాకుండా కండలేరు డ్యామ్ నుండి వచ్చే నీరు కూడా ఈ ప్రవాహం ద్వారానే ప్రవహిస్తుందని అందువల్లనే ఎక్కువ ఉద్రుక్తుగా ప్రవహించే అవకాశం ఉందని తాసిల్దార్ సుభద్ర సూచించారు. అంతేకాకుండా పిన్నేరు వాగు వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. రెవెన్యూ విలేజ్ అసిస్టెంట్లను, వీఆర్ఓ ద్వారా ఎప్పటికప్పుడు విషయం తెలిసికోని తక్షణ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ సుభద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సుభద్ర, ఆర్ఐ ప్రదీప్ కుమార్, రెవెన్యూ విలేజ్ అసిస్టెంట్, వీఆర్వో, గ్రామ ప్రజలు ఇతరులు పాల్గొన్నారు.

**మడ చెట్లు కాపాడుదాం..**

# ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణ పొందుదాం

### రిచా సంస్థ జిల్లా ప్రాజెక్ట్ సూపర్వైజర్ ఎంవి రమణయ్య



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** తీర ప్రాంతంలో ఉన్న మడ చెట్ల రక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉన్నదని రిచా సంస్థ జిల్లా ప్రాజెక్ట్ సూపర్వైజర్ ఎంవి రమణయ్య తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నుంచి కొంత రక్షణకు మడ చెట్లు చాలా ఉపయోగమని ఆయన తెలియజేశారు. ఆంధ్ర ప్రదేశ్ కోస్తా తీర ప్రాంతం నందు ప్రతి సంవత్సరము సంభవించు ప్రకృతి వైపరీత్యాలకు ప్రజల జీవన విధానం చింద్రవందరంగా తయారవుతుంది. ఆంధ్రప్రదేశ్ నందు భయంకర జల ప్రళయ దాడికి అనేక గ్రామాలు జీవనం స్తంభించిపోయింది పకృతి ఏ విధంగా అయితే సహజ సిద్ధంగా వనరులను కలిగి వుందో అదే విధంగా ప్రకృతిలో సాహజ సిద్ధంగా సముద్ర తీరంలో నదీ సంఘమా ప్రాంతాలలో ఏ ఇతర మొక్కలు మొలకెత్తిన టువంటి ఇసుక ఉప్పునీటి ప్రాంతాల్లో ప్రకృతి మనకు అందించిన చెట్లు మడ చెట్లు భారత దేశంలో సుమారు 85 రకాలైన మడ చెట్లు ఉంటే మన ఆంధ్ర రాష్ట్రంలో కనిపించేవి 11 రకాలు మాత్రమే ఈ 11 రకాలలో అత్యధికంగా కనిపించేవి పొన్న, నల్లమడ, తెల్లమడ, గుండు మడ మొదలగునవి మడ చెట్లను రక్షించితే పది నుండి 15 అడుగుల వరకు పెరిగి తుఫాను సమయంలో గాలుల తీవ్రతను తగ్గిస్తాయి. మడ చెట్లు సముద్రంలోని ఉప్పునీరు భూగర్భ జలాలలో కలిసి మంచి నీరు ఉప్పుమయం కాకుండా మడ చెట్లు కాపాడతాయి. ఒప్పుకోయ్యల యొక్క కట్టలు వరదల సమయంలో తెగిపోకుండా కాపాడతాయి. ఈ చెట్లు యొక్క వేర్లు పైకి ఉండుట వలన ఎక్కువ మోతాదులు ఆక్సిజన్ ను విడుదల చేస్తాయి. మడ చెట్లు ఉప్పుకోటారులను వేటుకు గురికాకుండా కాపాడతాయి. మడచెట్లు రెమ్మలు, ఆకులు ఎండి భూమిలో కలియుట వలన సముద్రపు అలలు ద్వారా సముద్రంలో కలిసి చేపలు, రొయ్యలకి ఆహారంగా ఉపయోగపడతాయి. ఈ చెట్లు దగ్గరికి చేపలు రొయ్యలు చేరి ఆకులు తింటూ అక్కడే గుడ్లు పెట్టి మత్స్య సంపద పెరుగుదలకు దోహదపడతాయి. ఈ చెట్లు ఉండే ప్రాంతాలకు అనేక రకాలైన పక్షులు వలస వచ్చి ఇక్కడే జీవన విధానం కొనసాగించుటకు ఉపయోగపడతాయి. ఈ ఉపయోగాలు ఉన్న మడచెట్లు గ్రామంలో పెంచుటకు, పశువుల బారిన పడకుండా ఎవరు ఈ చెట్లు నరకకుండా రక్షించుటలో ప్రజలు భాగస్వామ్య తమ వంతు పాత్ర వహించాలని కోరారు.

# టెంకవారిపాలెంలో భారీ వర్షాలకు కూలిపోయిన ఇల్లు




**జలదంకి, మేజర్‌న్యూస్ :** రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలదంకి మండలంలోని టెంకవారిపాలెంలో గోసు గోపాలయ్యకు చెందిన రేకుల ఇల్లు కూలి పోయింది. దివ్యాంగుడు ఐనా గోపాలయ్య మంచం మీద పడుకొని ఉండగా వర్షం కారణంగా ఆయన భార్య సునీత ఇంట్లోనే ఉన్నారు. ఏదో పడిపోతున్న శబ్దం వినిపించడంతో గోపాలయ్యను భార్య సునీతమ్మ బయటకు తీసుకొని వచ్చింది. బయటికి వచ్చి చూసే లోపే ఒక్కసారిగా ఆ రేకుల ఇల్లు గోడలతో సహా కూలిపోయింది. ఇంట్లోని వస్తువులన్నీ కట్టు బట్టలతో సహా శిథిలాల కింద ఉండిపోయాయి, భార్యాభర్తలు ఇద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా కుమార్తెలు ఇద్దరికీ వివాహం అయింది. కుమారుడు కూలి పనులకు వెళుతుంటాడు, వీరివి రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం ఇల్లు 50సెంట్లు పొలం తప్ప ఏమీ లేదు జలదంకి ఎస్ఐ లతీపున్నిసా, ఆర్ఐ నరసింహారావులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.

# కార్తీక మాసం ప్రారంభం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** శివ కేశవుకు ప్రీతి పాత్రమైన మాసం కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభం అయింది విశిష్టమైన కార్తీక మాసంలో దీపారాధన చేయడం ద్వారా సర్వ పాపాలు హరించుకు పోతాయని ప్రజల నమ్మకం సూర్యోదయానికి ముందే నది స్థానం చేసి శివకేశవ పూజలు చేసిన వారికి విశిష్టమైన పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. హిందూ సాంప్రదాయంలో కార్తీక మాసం అత్యంత పవిత్రమైన కాలంగా పరిగణించబడుతుంది. ఈ మాసం నేడు ప్రారంభమవు తోంది. 'న కార్తీక నమో మాసః, న దేవం కేశవాత్పరం! న చ వేద సమం శాస్త్రం, న తీర్థం గంగాయాస్తమమ్! అని స్కంద పురాణంలో పేర్కొనబడింది. అంటే కార్తీక మాసానికి సమానమైన నెల లేదు, కేశవుడికి సమానమైన దేవుడు లేదు, వేదాలకు సమానమైన శాస్త్రం లేదు, గంగకు సమానమైన తీర్థం లేదు అని అర్థం. ఈ మాసం శివకేశవులిద్దరికీ ప్రీతికర మైన కాలంగా ఉండటంతో, భక్తులు శివాలయాలు, విష్ణు ఆలయాలను దర్శించడానికి, దీపాలు వెలిగించడానికి, వ్రతాలు ఆచరించడానికి ముందుంటారు. కార్తీక మాసం ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే సమయం. ఈ కాలంలో శివుడు, కేశవుడు ఇద్దరినీ పూజించడం ద్వారా జన్మజన్మల పుణ్యఫలం దక్కుతుందనే ప్రగాఢ విశ్వాసం.

## ఎకో బయో ప్యూయల్స్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని సూరాయపాలెం పవర్ ప్లాంట్ ఆవరణంలో ఉన్న ఎకో బయో ప్యూయల్ ఫ్యాక్టరీ(పిడకల ఫ్యాక్టరీ)లో బుధవారం అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సవక, జామాయిల్ తాట, వాటి పొట్టుతో ఈ ఫ్యాక్టరీలో పిడకలు తయారు చేస్తుంటారు. పిడకల తయారీకి ఉపయోగించే వేడి కారణంగా సమీపంలోని సవక, జామాయిల్ పొట్టుకు రెండు రోజుల క్రితం మంటలు అంటుకున్నాయి. ఫ్యాక్టరీలో నిల్వ ఉన్న సుమారు 3వేల టన్నుల పొట్టుకు మంటలు అంటుకోవడంతో అదుపు చేయడం కష్టంగా మారింది. ఎంతకీ మంటలు అదుపులోకి రాకపోవడంతో సమాచారం అందుకున్న పొదలకూరు అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వెళ్లి మంటలు ఆర్పుతున్నారు. కాగా ఎంత నష్టం వాటిల్లిందనేది తెలియాల్సి ఉంది.

## ములుమూడిలో పొంగిపొర్లుతున్న చెరువు కలుజు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని ములుమూడి గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ములుమూడి చెరువు కలుజు పొంగి పొర్లుతుండడంతో ద్విచక్ర వాహనదారులకు ప్రయాణికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అలాగే పొదలకూరు, సంగం, నెల్లూరు రూరల్ మండలలను కలుపుతూ ప్రధాన రహదారి కావడంతో గ్రామాల నుంచి ఉపాధికై నెల్లూరు కెళ్లే కార్మికులు ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు ఆటో సోదరులు ఆ నీటిలో ప్రవాహానికి పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినప్పటికీ ఈ కాలుజు పై బ్రిడ్జి నిర్మాణం వెంటనే నిర్మించాలని నిరసన కార్యక్రమాలు ధర్నాలు అనేక మార్లు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేయడం జరిగింది. కానీ అధికారుల్లో ఎటువంటి స్పందన లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ యొక్క ములుముడి కలుజుపై బ్రిడ్జిని వెంటనే ఏర్పాటు చేయాలని నెల్లూరు రూరల్ మండలం సిపిఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

## దారకంపాడు బాధిత కుటుంబానికి అండగా..

# బలిజసేవాఫౌండేషన్

- 50వేల నగదు పంపిణీ
- 11లక్షలకు భీమా ప్రీమియం చెల్లింపు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని కందుకూరు నియోజకవర్గపరిధిలోని దారకానిపాడులో ఇటీవల హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మినాయుడు కుటుంబానికి నెల్లూరు జిల్లా బలిజసేవాఫౌండేషన్ బాసటగా నిలిచింది. బిఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ప్రముఖపల్మనాలజిస్ట్, డెల్టా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ పోకల రవి, ఇతర బిఎస్‌ఎఫ్, ఏపికాట్వా నాయకులు బుధవారం దారకానిపాడుకు వెళ్ళి మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి తమవంతుగా 50వేలరూపాయల నగదును మృతుడు భార్య సుజాతకు అందజేశారు. దాంతోపాటు మృతుడి కుమార్తెలిరువురికి 11లక్షలరూపాయల భీమాకు అవసరమైన 21వేలరూపాయల ప్రీమియం కూడా చెల్లించారు. 50వేల రూపాయలను ఫిక్స్‌డ్‌డిపాజిట్టుచేసేలా సూచించారు. ఆ ఇద్దరు పసిబిడ్డల భవిష్యత్తుకోసం ప్రధాన మంత్రి సుకన్యయోజన పధకంద్వారా ఏడాదికి సరిపడా ప్రీమియం 21వేల రూపాయలు (బిఎస్‌ఎఫ్10వేలు, డాక్టర్ పోకలరవి 11వేల రూపాయలు పోస్టాఫీస్‌లో చెల్లించేలా నిర్ణయించారు. 15సంవత్సరాలపాటు ప్రీమియం 3,15,000 రూపాయలను బిఎస్‌ఎఫ్ తరపున 1,50,000, డాక్టర్ పోకల రవి 1,65,000 రూపాయలు చెల్లించేలా నిర్ణయించారు. 50వేల రూపాయలు మృతుడిభార్య సుజాతకు చెల్లించగా ఆమొత్తాన్ని బిఎస్‌ఎఫ్ నాయకులు చదలవాడహరిబాబు, మద్దినేని శ్రీనివాసులు, నారదాసురవి, దండే వెంకటేశ్వర్లు 5వేలరూపాయలవంతున, కమతం సుబ్బారావు, పెద్దిశెట్టి రాధాకృష్ణ, చక్కాకుమార్, బెల్లంకొండ లక్ష్మయ్య, కత్తిమహేష్, పాపిశెట్టి జానకిరామ్, సానం కృష్ణ, పోలిశెట్టి శ్రీనివాస్, పోలిమునిశేఖర్, దోర్నాల రామ్మోహన్, కళాంజలి శ్రీనివాసులు, చిమటాశేషగిరిలు 2వేలవంతున, దాడి శ్రీనివాసులు, టి.వి.రావు, పామూరు మధుసూధన్, చక్కా సూలంహరిబాబు, నలిశెట్టి సందీప్, శంకవరపు వెంకట సుబ్బయ్యలు 1000రూపాయలవంతున సమకూర్చారు. ఈసందర్భంగా డాక్టర్ పోకల రవి, కమతం సుబ్బారావులు మాట్లాడుతూ చిన్న వయసులోనే తిరుమలశెట్టి లక్ష్మినాయుడు హత్యకు గురికావడం హృదయవిదారకమని, ఆకుటుంబం ఇబ్బందుల్లో పడడంతో తమవంతుగా బలిజసేవాఫౌండేషన్ ద్వారా నాయకులు ఉదారమనసుతో సమకూర్చిన నగదును తమవంతుగా ఆయన భార్య, బిడ్డలకు అందజేశామని, భీమా కూడా చేయనున్నామని పేర్కొన్నారు. జిల్లాలో బలిజసేవా ఫౌండేషన్ ద్వారా ఆపదలోఉన్నవారికి, తల్లిదండ్రులు లేని పిల్లలకు, చదువుకుంటున్న పేద విద్యార్థులకు తమవంతుగా ఆర్థికసాయమందిస్తున్నా బలిజసేవాఫౌండేషన్ నాయకులు పలువురు లక్ష్మినాయుడు కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకురావడం సంతోషదాయకమని, వారికి ప్రత్యేక ధన్యవాదాలని డాక్టర్ రవి, కమతం సుబ్బారావులు పేర్కొన్నారు.

లక్ష్మినాయుడును హత్యచేసిన నిందితుడిపై సత్వరమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మృతుడి కుటుంబానికి తమవంతుగా అండగా ఉంటామని వారు వెల్లడించారు. ఈకార్యక్రమంలో బలిజసేవా ఫౌండేషన్ నాయకులు, ఏపికాట్వా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మనాభరెడ్డి ఉత్తరక్రియలలో వివిధ పార్టీ నాయకులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం వాస్తవ్యులు అలాగే మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు పాలవెల్లి పద్మనాభరెడ్డి ఇటీవల ఒక ప్రమాదంలో మృతి చెందారు. బుధవారం జనతా పేటలో వారి స్వగృహంలో ఉత్తరక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు వైసీపీ నాయకులు హాజరయ్యారు. మొదటిగా విష్ణు వర్ధన్‌రెడ్డి నాయకులు కలిసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. మంచి మనిషి నిగర్వి అయిన పద్మనాభరెడ్డి మృతి చెందడం చాలా బాధాకరమని తను ఎంతోమందికి ఆర్థికంగానూ ఇంకో విధంగా కూడా ప్రజలకు సహాయం చేసిన వ్యక్తి అని తను ఎవరికి ఆపద వచ్చినా నేనున్నాను అను భరోసా కల్పించే వ్యక్తిని తన అభిమానుల్లో ఈరోజు చిరస్థాయిగా నిలిచిపోయారని, ఈరోజు జరిగిన ఉత్తర క్రియల్లో వర్షం ఉన్నప్పటికీ కూడా భారీగా హాజరవ్వడం గొప్ప విశేషమని వారు తెలిపారు. వారు లేని లోటు తీర్చలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మేకపాటి రాజగోపాల్ రెడ్డి సుకుమార్ రెడ్డి ప్రస్తుత ఏఎంసీ చైర్మన్ అలేఖ్య దంపతులు అభిమానులు భారీగా పాల్గొన్నారు.

## రైతు సేవలో ముందున్న టీడీపీ నాయకులు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం కంటేపల్లిలో జోరు వర్షంలో కూడా తెలుగుదేశం పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ రావూరు రాధాకృష్ణమ నాయుడు రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రతి రైతుకూ యూరియా కార్డులు, యూరియా ఎరువులు అందజేస్తామన్నారు. రైతులు ఎవ్వరూ ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. కంటేపల్లి చెరువును పరిశీలించి చెరువులో నీటి నిల్వ స్థితి, పరిసరాల పరిస్థితులను సమీక్షించారు. చెరువు మరమ్మతులు, నీటి ప్రవాహ మార్గాలపై కూడా సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఆస్తోటి నాగరాజు, నీటి సంఘం సభ్యులు ఆస్తోటి సుబ్బయ్య, మండల వ్యవసాయ అధికారి హరి కరుణాకర్ రెడ్డి, నాయకులు తలారి విమలకర్, దొడ్డక నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా చర్యలు చేపట్టిన అధికారులు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలో భద్రత చర్యలు మండల పరిషత్ అధికారులు చేపట్టారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సైదాపురం మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు, మండల పరిధిలోని తురిమెర్ల సమీపంలోని పినేరు వాగు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీ రామ్మోహనరెడ్డి బుధవారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. రహదారిపై రాకపోకలు కొనసాగకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే తురిమెర్ల, గ్రిద్దలూరు, ఊటుకూరు సచివాలయం లను సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేసి, సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షంలో పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు స్థానిక చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు అపోలో హాస్పిటల్ కూడలి ప్రాంతంలో రోడ్డు దెబ్బతిని భారీ గోతి ఏర్పడడంతో వాహన ప్రమాదాలు సంభవించాయి. సమాచారం అందుకున్న కమిషనర్ వైఓ నందన్ హుటాహుటిన అధికారులతో కలిసి రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాన్ని బుధవారం ఉదయం సందర్శించారు. దెబ్బతిన్న రోడ్డులో ప్రమాదవశాత్తు ఇరుక్కుపోయిన వాహనాన్ని కమిషనర్ దగ్గరుండి బయటకు తీయించారు. వాహన ప్రమాదాలు సంభవించకుండా తగిన సూచికలను ఏర్పాటు చేసి, ఆ ప్రాంతం మొత్తం సురక్షితం చేయాలని, వేగవంతంగా మరమ్మతు పనులను చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు.

## ప్రహరీ గోడను తొలగింపు : అధికారులు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు శిథిలావస్థలో ఉన్న భవనాలు కూలిపోయి ప్రాణాపాయం జరిగే అవకాశాలు ఉన్నందున కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు అన్ని డివిజన్లలో వార్డు సచివాలయ కార్యదర్శులు పర్యటించి ప్రమాద స్థితిలో ఉన్న భవనాలను గుర్తించారు. స్థానిక 46వ డివిజన్ ముత్తరాజు వారి వీధి ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న ప్రహరీ గోడను పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది బుధవారం తొలగించారు.

## ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశాల మేరకు స్థానిక హరనాధపురం ప్రాంతంలోని కాలువ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని బుధవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల నేతృతంలో సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ స్థలాలు, ప్రభుత్వ భూములు, రోడ్లు, డ్రైను కాలువలను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా తప్పనిసరిగా తొలగించి వేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ హెచ్చరించారు.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మండల వైసీపీ కన్వీనర్ బిజి వేముల పిచ్చిరెడ్డి

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు అనంతసాగరం మండలంలోని పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అనంతసాగరం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిజీ వేముల పిచ్చిరెడ్డి పేర్కొన్నారు. మండలంలో వెయ్యి ఎకరాల పైగా పంట నష్టం జరిగినట్లు ఆయన తెలిపారు. మండలంలోని కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రైతులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. నీట మునిగిన వరి పంటను తానే స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు.

# నేటి నుంచి 25 వరకు భారీ వర్షాలు



● అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి ● మత్స్యకారులు వేటకు వెళ్లరాదు ● 24 గంటలు పని చేసేలా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు ● జిల్లా కలెక్టరేట్ కార్యాలయం కంట్రోలు రూం నెంబర్లు 0861 2331261, 7995576699 ● కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** తుఫాను కారణంగా జిల్లాలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. ఈనెల 23 నుంచి 25 వరకు భారీ నుండి అతి భారీ వర్షాల ప్రభావం అధికంగా ఉండనున్న నేపథ్యంలో అధికారులను, ప్రజలను అప్రమత్తం చేస్తూ.. ప్రజలు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై బుధవారం జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాల కారణంగా ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని, టామ్ టామ్ లేదా మైకుల ద్వారా ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్డీవోలు, తహశీల్దార్లను ఆదేశించారు. అనుకోని అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ముందు జాగ్రత్తగా అనువైన ఆశ్రయ కేంద్రాలను గుర్తించి తరలించాలన్నారు. అన్ని శాఖల అధికారులు ముఖ్యంగా మున్సిపల్, వైద్య, ఆరోగ్యం, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ , విపత్తు నిర్వహణ (అగ్నిమాపక) తదితర శాఖల అధికారులు, వారి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అలాగే అధికారులు అందరూ జిల్లా కేంద్రం / వారు పనిచేసే స్థానంలోనే అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు ఆగిపోయే వరకు సెలవులు మంజూరు చేయమన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24/7 పనిచేసే విధంగా కంట్రోల్ రూమును ఏర్పాటు చేసి అందులో షిఫ్ట్ సిస్టంలో పని చేసే విధంగా సిబ్బందిని నియమించామన్నారు. ప్రజల నుండి కంట్రోల్ రూమ్‌కి కాల్స్ వచ్చిన వెంటనే తగు సహాయం అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడైన వాటర్ లాగింగ్ ఉంటే వెంటనే ఆ నీటిని క్లియర్ చేయాలన్నారు. నిరంతర విద్యుత్తు సరఫరా ఉండాలన్నారు. చెరువులు, కాల్వలు, ప్రాజెక్టుల వద్ద సిబ్బందిని ఉంచి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తనకు తెలియచేయాలన్నారు.

**కంట్రోల్ రూమ్ నెంబర్లు :** జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, నెల్లూరు కంట్రోల్ రూమ్ : 0861 2331261, 7995576699.

**భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ సూచనలు :** భారీ వర్షాలు కురిసేటప్పుడు అత్యవసరమైతేనే ప్రజలు బయటికి రావాలని, నదులు, వంకలు పరివాహ ప్రాంతాలు, అన్ని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భారీవర్షాలతో పొంగిపొర్లే వాగులు, కాలువలు, రోడ్లు, కల్వర్టులు, మ్యాన్ హోల్స్‌కు దూరంగా ఉండాలన్నారు. భారీవర్షం పడేప్పుడు బయట ఉన్నట్లయితే ఒరిగిన విద్యుత్ స్థంబాలు, తీగలు, చెట్లు, హోర్డింగ్స్ క్రింద ఉండరాదని, వర్షాలతోపాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, కాపరులు చెట్లు, పోల్స్, టవర్స్ కింద ఉండరాదని తెలియజేశారు. నదులు, వంకలు పరివాహ ప్రాంతాలు, అన్ని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాల వల్ల చెరువులు, కాలువలకు గండ్లు పడే అవకా శం ఉండొచ్చు. ముందస్తు జాగ్రత్తలు తీసుకో వాలని, అవసరమైన ఇసుక బ్యాగ్స్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు ఆదేశించారు. పూరి గుడిసెలు, పాత మిద్దెలు, మట్టితో కట్టిన ఇళ్ళల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని తెలియజేశారు.

**వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు**

తడిసిన కరెంట్ స్థంబాలను ముట్టుకోరాదని, తడిసిన చేతులతో స్టార్టర్లు కాని మోటార్లు కానీ ముట్టుకోరాదని, విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోరాదన్నారు. విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియజేయాలని, పార్కులలో గాని స్టేడియంలో గాని విద్యుత్ స్థంభాలు ముట్టుకోరాదని, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోకూడదని, బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలన్నారు. కరెంటుకు సంబంధించిన వస్తువులు తడి చేతులతో ముట్టుకోరాదని, చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలని, ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదన్నారు. గాలి, దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదని, ఇంట్లో ఉన్న వాటర్ హీటర్ యొక్క స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే నీళ్లు పెట్టిన వస్తువును ముట్టవలెనని తెలియజేశారు. ఉరుములు మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలని, వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిడ్జ్ కంప్యూటర్‌ల యొక్క స్విచ్ లను ఆఫ్ చేయవలెను, లేనిచో వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుందన్నారు. కరెంటు లైన్ క్రింద సెల్ ఫోన్ మాట్లాడకూడదు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైన డ్యామేజ్ అయినచో సంబంధించిన విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని తెలియజేశారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కావలి ఆర్డీఓ



**కావలి, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర రూపం దాల్చి తుఫాన్గా మరి అవకాశాలు ఉన్నందువల్ల రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు ప్రభావం వలన కావలి నియోజకవర్గం ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని 23, 24 తేదీలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలపడంతో జాగ్రత్తగా ఉండాలని ఆర్డీవో ఎస్ వంశీకృష్ణ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి రాబోవు ప్రమాదాల్ని గ్రహించి పరిస్థితులు తీవ్రమైతే టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

## శివాలయంలో కార్తీక మాసం ప్రారంభం

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలోని శ్రీ కామాక్షి సమేత సోమేశ్వర ఆలయంలో బుధవారం కార్తీకమాసం పూజలు ప్రారంభమైనట్లు ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ శర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచిప్రజలు అయ్యప్ప మాల ధారణ, దీక్షల్లో చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

▶ కలిగిరి సర్కిల్ సీఐ వెంకటనారాయణ



**కలిగిరి/వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలిగిరి సర్కిల్ సీఐ వెంకటనారాయణ కోరారు. మంగళవారం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు అధికారులు పలు సూచనలు చేశారు. బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ఏర్పడినట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని, దీనివల్ల భారీ వర్షాలు పడతాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు లోతట్టు ప్రాంతాల నుండి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని కలిగిరి సర్కిల్ సిఐ వెంకటనారాయణ కోరారు. అధికారులు లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షితంగా తరలించేందుకు అన్ని విధాల ముందస్తు జాగ్రత్త ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## విద్యాసంస్థలకు నేడు కూడా సెలవు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారీగా వర్షాలు కురుస్తుండడం, బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మరో నాలుగురోజులు భారీ వర్షాలు కురవనున్నయన్న హెచ్చరికలనేపథ్యంలో జిల్లాలోని విద్యాసంస్థలకు గురువారం సెలవుదినంగా కలెక్టర్ హిమాన్ష్ శుక్లా ప్రకటించారు. వర్షాలవలన బుధవారం కూడా కలెక్టర్ సెలవు ప్రకటించడం తెల్సిందే. భారీగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండడం, విద్యాసంస్థల ఆవరణల్లో అధికంగా నీరు చేరడంతో అత్యంత ఇబ్బందికరంగా ఉండగా కలెక్టర్ ముందస్తు జాగ్రత్తగా సెలవులు ప్రకటించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలప్రకారం ప్రభుత్వ, ప్రవేటు విద్యా సంస్థలు తప్పకుండా సెలవును అమలుచేయాలని పలువురు కోరుతున్నారు.

## వర్ష ప్రభావం వల్ల ప్రజలు తగు జాగ్రత్త తీసుకోవాలి

▶ గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలు

▶ నెల్లూరు నగరంలో పలు రహదారులు జలమయం

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండము ప్రభావం తో గత రెండు రోజులు గా నెల్లూరు జిల్లా ను వర్షం ముంచెత్తుతుంది. జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరం లోని ప్రధాన రహదారులన్నీ జలమయం అవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. చిరు వ్యాపారులు దినసరి కూలీలు పనులు లేక ఇబ్బంది పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు రెండు రోజులు పాఠశాలలు కళాశాలకు ఇప్పటికే సెలవు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ లోతట్టు ప్రాంతాలలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. తుపాన్ ప్రభావం వల్ల ఇబ్బంది కలుగ కుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నెల్లూరు నగరంకు సంబందించిన కార్పొరేషన్‌లో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ కార్యాలయంలోను హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వరద పరిస్థితులను పర్యవేక్షణ చేస్తున్నారు. మత్స్య కారులను వేటకు వెళ్ళ వద్దని తెలియజేశారు. కురిసిన వర్షాలకు జిల్లాలోని ఆత్మకూరు ఉదయగిరి ప్రాంతాలలో రైతులకు కొంత మేరకు నష్టం జరిగినట్లు సమాచారం.

# హెల్త్ మినిస్టర్ జిల్లాలో ఆరోగ్య సేవలు కాస్త మెరుగుపరచండి

● ఖరీఫ్ సీజన్లో 51 లక్షల టన్నులు ధాన్యం సేకరణ లక్ష్యంగా నాదెండ్ల మనోహర్ అడుగులు

● జనసేన నాయకులు నూనె మల్లికార్జున్ యాదవ్, కిషోర్ గునుకుల



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ నెల్లూరు జిల్లా కార్యం గోమతి నగర్ నందు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, సీనియర్ నాయకులు మల్లికార్జున యాదవ్, శేఖర్ రెడ్డి, ముఖ్యనాయకులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. భారీ వర్షాలకి అత్యవసరమైతే తప్ప ప్రజల ఈ బయటకు రావద్దు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. అధికారులు, కూటమి నాయకుల తోపాటు జన సైనికులు ప్రజలకు అందుబాటులో ఉండండి. కందుకూరు లక్ష్మీనాయుడు హత్య కిరాతకమైన చర్య, దాన్ని కులాలకు, పార్టీలకు ఆపాదించడం అంతర్గత కుట్ర.. కూటమి ప్రభుత్వం బాధితులకు పూర్తి న్యాయం చేస్తుంది. ఖరీఫ్ సీజన్‌లో 51లక్షల మెట్రిక్ టన్నులు దాన్యం సేకరణ లక్ష్యంగా నాదెండ్ల మనోహర్ సూచించారు. అన్ని జిల్లాలకు సంబంధించిన అన్నదాతలకు కచ్చితంగా కూటమి ప్రభుత్వం న్యాయం జరుగుతుంది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ జిల్లాలోని ఆరోగ్య సేవలను మెరుగుపరచాలి, వరదల అనంతరం ప్రజలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల కనుగునంగా పీహెచ్‌సీలో సిబ్బంది మెరుగుపరచాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరామ్, వ్యవసాయ మార్కెట్ ఏఎంసీ డైరెక్టర్ సురేష్, నాయకులు జమీర్, కృష్ణారెడ్డి, సుధా మాధవ్, గుర్రం కిషోర్, సుధాకర్, నాగేంద్రబాబు కృష్ణమోహన్ రెడ్డి, మనోజ్, పెనేటి శ్రీకాంత్, హరి, వర్షన్, పవన్, వీర మహిళల శాంతి కల తదితరులు పాల్గొన్నారు.

## కార్తికం.. శైవ క్షేత్రాలకు శోభ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** కార్తిక మాసం వచ్చిందంటే శివాలయాలు భక్తులతో కళకళాడుతుంటాయి. ఈ మాసాన్ని సాక్షాత్తూ పరమేశ్వరుడి స్వరూపంగా భావించి భక్తులు నెల రోజుల పాటు దీక్షతో పూజలు చేస్తారు. ఉపవాసాలు చేసి పార్వతీ పతిని అభిషేకాలతో కొలుస్తారు. ఆకాశ దీపాన్ని వెలగించి కుటుంబమంతటినీ చల్లగా చూడమని వేడుకుంటారు. ఈ ఏడాది బుధవారం నుంచి కార్తిక మాసోత్సవం ప్రారంభమవడంతో పట్టణంలోని చోళులు కాలం నాటి శివాలయంతో పాటు, మండలంలోని డేగపూడి,పీజీ పట్నం, బిరదవోలు, చెన్నారెడ్డిపల్లి, విరువూరు, తాటిపర్తి, శైవ క్షేత్రాల్లో సుందరంగా ముస్తాబై భక్తుల పూజలందుకుంటున్నాయి.

# తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబానికి భరోసా



- మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు
- హత్యకు గురైన కార్యకర్త కుటుంబానికి నగదు చెక్కులు అందజేసిన మంత్రి నారాయణ



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** అక్టోబర్ 2న గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు హత్య చాలా దారుణమైనదని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. బుధవారం నెల్లూరులోని రోడ్లు భవనాలు అతిథి గృహములో తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి నారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుమల శెట్టి లక్ష్మీనాయుడు భార్య సుజాతకు ఐదు లక్షల రూపాయల చెక్కును, కుమార్తెలు లహన్వి శ్రీ, తన్వి శ్రీలకు 5లక్షల రూపాయలు వంతున, తిరుమలశెట్టి భార్గవ నాయుడుకి మూడు లక్షలు, తిరుమలశెట్టి పవన్ కుమార్‌కు 5లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విషయం తెలిసిన వెంటనే లక్ష్మీ నాయుడు హత్య ఉదంతంపై తక్షణమే స్పందించి హోం శాఖ మంత్రి అనిత, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, శాసనసభ్యులు శ్రీనివాసరావులతో కమిటీ వేయడం జరిగిందన్నారు. కమిటీ తుది నివేదిక ప్రకారం లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునే చర్యలలో నిన్న ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా నగదుతో పాటు వారి కుటుంబ సభ్యులకు రెండు ఎకరాలు వంతున మొత్తం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందన్నారు. అంతేకాక పిల్లల చదువులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ఆయన తెలిపారు. హత్యాకాండలో వెన్నుపూసకు దెబ్బ తగిలి ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న తిరుమల శెట్టి పవన్ కుమార్‌కు ఐదు లక్షల రూపాయలు, నాలుగు ఎకరాల భూమిని ఇవ్వడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా గాయలతో బాధపడుతున్న తిరుమలశెట్టి భార్గవ నాయుడుకు మూడు లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందన్నారు. హత్య కేసుపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటుచేసి వీలైనంత త్వరగా నేరస్తులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. వాస్తవానికి లక్ష్మీ నాయుడు, హరిశ్చంద్రప్రసాదులు స్నేహితులని కొన్ని లావాదేవీలలో వచ్చిన తేడాల వల్ల హత్య చేయడం జరిగిందని తెలిసిందన్నారు. పిల్లలకు చెల్లించిన నగదును బ్యాంకులో డిపాజిట్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అక్టోబర్ రెండో తారీఖున జరిగిన హత్యా ఘటన ఒక విషాద గాదాని, ఇద్దరు స్నేహితులు మధ్య వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో హత్య జరిగిందన్నారు. జరిగిన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునే విధంగా కమిటీ వేయడం జరిగిందని కమిటీ నివేదిక మేరకు నిన్న రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి వారి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఇటువంటి దుర్ఘటనలు జరగ కుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అభిప్రాయ పడ్డారు. అనంతరం బాధితురాలు సుజాత మాట్లాడుతూ.. ఇది కేవలం వ్యక్తి గత కక్షలతో జరిగిందని రాజకీయ అంశాలు ఏమీ లేవని ఆమె తెలిపారు. హత్య జరిగిన తదుపరి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నేరస్తులను కఠినంగా శిక్షించాలని ఈ సంద ర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి విజయ్‌కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి అనూష, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎం.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ అజిత వేజెండ్ల



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** తుఫాన్ కారణంగా జిల్లాలోని వాగులు, వంక లు పొంగి పొర్లుతున్నాయని అధికారులతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల సూచించారు. పొదలకూరు మండలంలోని నావూరుపల్లి పెద్దవాగు పొంగి నాలుగు గ్రామాలకు రాకపో కలు స్తంభించడంతో వాగు ఉద్ధృతిని బుధవారం సాయంత్రం ఆమె పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు తగ్గుముఖం పట్టి కాలువలు, వాగుల్లో నీటి ప్రవాహం తగ్గేవరకు రైతులు, ప్రజలు సాహశించి వాటిని దాటే ప్రయత్నం చేయరాదన్నారు. పెన్నా నది పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు ముఖ్యంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసులు, పొదలకూరు సీఐ ఏ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ మహమ్మద్ హనీఫ్, పొదలకూరు పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్





**కావలి, మేజర్‌న్యూస్ :** గత రెండు రోజుల నుంచి రాష్ట్రములో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కావలి పట్టణంలో గత రెండు రోజులు నుంచి ఎడతెరిపిలేని వారసును కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు, కావలి మెయిన్ రోడ్‌లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. విషయాన్ని గమనించిన కావలి మున్సిపల్ కమిషనర్ పారిశు ధ్ధ్య కార్మికులతో రోడ్డుకి ఇరువైపులా ఉన్న డ్రైనేజీలను చెత్త మరియు ఇతర పదార్థాలను తొలగించి వర్షపు నీరు నిల్వ లేకుండా సజావుగా వెళ్ళుటకు చర్యలు తీసుకున్నారు. అలాగే బ్యానర్లను తొలగించడం కూలిపోయిన చెట్లను సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించి పరిసర ప్రాంతాలను పరిశీలించడం జరిగింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రంచేస్తూ చర్యలు తీసుకోవడం జరిగింది. అలాగే 36వ వార్డు శివరామ సుబ్బయ్య కాలనీ లోతట్టు ప్రాంతమై ఉన్నది. ఈ ప్రాంత ప్రజలు రెండు గత రెండు రోజుల నుంచి ఆహారం లేక ఇబ్బందులు పడుతున్న సభలో వారికి కావలసిన ఆహారము, నీరు అందించారు. అలాగే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వర్ష ప్రభావం వలన ఎవరికి ఏ సమస్యలు వచ్చినప్పటికీ కంట్రోల్ రూమ్ 9963029494కు ఫోన్ చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ తెలిపారు.

## సోమిరెడ్డి చొరవతో తప్పిన ముప్పు

- నక్కలకాలువలో పెరిగిన ప్రవాహం
- వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం అట్రంవారికండ్రిగ వద్ద భారీవర్షాల కారణంగా నక్కలకాలువలో నీటి ప్రవాహం తీవ్రంగా పెరిగింది. కాలువలో భారీగా పేరుకుపోయిన గుర్రపుడెక్క కారణంగా నీటి ప్రవాహం నిలిచిపోయి, సమీప పొలాలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి గురించి సమాచారం అందుకున్న వెంటనే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అధికారులు, స్థానిక నాయకులను అప్రమత్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు ప్రొక్లెయిన్‌తో అట్రంవారికండ్రిగ వద్దకు చేరుకున్న అధికారులు, చవటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు, సర్వేపల్లి రిజర్వాయర్ చైర్మన్ చల్లా నాగార్జునరెడ్డి తదితరులు కలిసి చర్యలు చేపట్టారు. ప్రొక్లెయిన్ సాయంతో కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించడంతో నీటి ప్రవాహం సవ్యంగా కొనసాగింది. దీంతో పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం తప్పి, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను తెలుసుకున్న వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నందుకు రైతులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సన్నారెడ్డి బాలకృష్ణ రెడ్డి, పేర్నాటి విజయసేనారెడ్డి, పాపారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దువ్వూరు చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పనులను పర్యవేక్షించారు.